

# దొంగలు నిజంగానే వచ్చారు

రమణమూర్తిగారిల్లు జనాలతో హడావిడిగాను, బీభత్సంగానూ ఉంది. వచ్చేపోయే వాళ్లతో కోలాహలంగా ఉంది. కాలనీలోని ప్రతివాళ్లూ రావటం, తొంగిచూడటం, ఇల్లంతా పరికించడం, పరిశీలించడం... 'అయ్యో అయ్యో' అంటూ నోళ్లు నొక్కుకోవడం... నిట్టూర్పులు విడుస్తూ వెళ్లడం... వెళ్లి మరో నలుగురికి చెప్పడం... మరో పదిమంది రావడం...

"ఇల్లంతా చిందరవందర చేసారు... తలుపులు ఇనపరాడ్‌తో తీసారు... కనీసం లోపల బోల్ట్‌లన్నా పెట్టించుకోవద్దూ" అని ఒకరంటే... "ఆ... వాళ్లకి మరీ అజాగ్రత్తలేమ్మా... ఎప్పుడు చూసినా పరిగెత్తుకు పుట్టింటికి పోవడమే... ఇంటి ధ్యాసే ఉండదా మహాఇల్లాలికి. అదేం చోద్యమో" అంటూ మరో సాధ్వీమణి అక్కసు.

"పాపం... బీరువాలో అడుగున రహస్య అరమాత్రం ముట్టుకోలేదట... ఆ దొంగలకి కనబడ్డట్టు లేదు..." మరో మహిళామణి ఆవేదన... దొంగల మీద జాలితో.

ఇలా వాగుతూ కాలక్షేపం చేస్తున్నారే తప్ప విషయాన్ని ఆ ఇంటి ఆసామి రమణమూర్తికి తెలపాలన్న ఇంగితజ్ఞానం ఒక్కళ్లకీ లేదు.

విషయం తెలుసుకుని హడావిడిగా వచ్చిన మూర్తి కొలీగ్ సురేష్ వెంటనే పరిస్థితిని గ్రహించి, ముందురోజు రాత్రే అత్తగారింటికి వెళ్లిన రమణమూర్తి చెవిలో ఫోన్ ద్వారా విషయాన్ని వేసాడు.

గడ్డపెరుగుని కోస్తూ తీరిగ్గా భోంచేస్తున్న రమణమూర్తికి సురేష్ ఫోన్‌తో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఉరుకులు పరుగుల మీద ఇల్లు చేరేప్పటికి మధ్యాహ్నం 2 దాటింది.

తన ఇంటి ముందున్న జనాలని చూస్తే

మొలుగు కమలాకాంత్

రమణమూర్తి పై ప్రాణాలు పైనే పోయాయి. సరుగు పరుగున ఇంట్లోకి వెళ్లబోతూంటే గేట్ లోపల పెద్ద గడ్డపలుగు నిలబెట్టిఉంది. సింహ ద్వారం తలుపు గొళ్లాలను బ్రేక్ చేశారు "నా తోనే" అంటూ ఠీవిగా నించున్న పలుగు నవ్వి నట్లుంది.

లోపలికి వెళ్లి చూస్తే డీవీడీ ప్లేయర్ లేదు.

బెడ్‌రూమ్ తలుపు కూడా బ్రేక్ చేశారు. పరిగెత్తుకుంటూ బీరువా దగ్గరికి వెళ్లాడు. బట్టలన్నీ చిందరవందరగా క్రిందపడేసున్నాయి. ఐదు వెండిగిన్నెలు, వెండిగ్లాసు, వెండికంచం మాయం. బంగారం ఇంట్లో అస్సలుంచలేదు. భార్యకున్న నాంతాడు, గొలుసూ ఒంటిమీదే ఉన్నాయి.

బీరువాలో అడుగున ఉన్న రహస్య అర తెరిచి చూసాడు. దస్తావేజులు వగైరాలన్నీ యధాతథంగా ఉన్నాయి. "హమ్మయ్య" ఊపిరి పీల్చుకున్నాడు.

"అయ్యయ్యో... నాపట్టుచీరలండీ... జరీ చీరలు... వెండికంచం, గ్లాసు, గిన్నెలు... అన్నీ పోయాయండీ... ఆ దొంగముండావాళ్లెత్తుకు పోయారండీ" లబోదిబోమంటోంది భార్య లీలావతి.

చుట్టూ జనాలంతా ఆసక్తితో, ఎంతో ఉత్కం ఠంతో ఏమేం పోయాయో తెలుసుకుని పదిమం దికీ చెప్పాలన్న కుతూహలంతో వింటున్నారు.

రమణమూర్తికి మంచి ఐడియా వచ్చింది. ఇలాంటి సమయాల్లో మరిన్ని ఎక్కువ పోయి నట్లు చెప్పి యఫ్.ఐ.ఆర్. కట్టిస్తే, సొంతం ఇవ్వ కపోయినా సగమైనా పోలీసులు ఇస్తారనీ; తన బంగారం కాకపోయినా వేరే ఎవరిదైనా ఇచ్చి కేస్ క్లోజ్ చేస్తారనీ ఎవరో ఎప్పుడో చెప్పుకోగా విన్న విషయం సమయానికి గుర్తుకొచ్చింది.

"అరే సురేష్... నా బ్రేస్‌లెట్‌రా... నా గోల్డ్ చైన్, వెంకటేశ్వరస్వామి ఉంగరం... సాయి బాబా ఉంగరం... అన్నీ పోయారురోయ్..." పెద్దగా గోలపెడుతున్నాడు మూర్తి.

అంత బాధలోనూ లీలావతికి ఆశ్చర్యమే సింది. ఏదో అనబోయేంతలో "లీలావతీ..." అంటూ ఓదారుస్తున్నట్లుగా దగ్గరికి తీసుకుని భార్య నోరు నొక్కేసాడు.

"అరే... వీడు చెప్పిన వస్తువులేవీ వీడెప్పు డూ పెట్టుకోగా గత పదేళ్లలో చూళ్లేదే..." అను కుంటూ అనుమానంగా చూసాడు సురేష్.

కానీ అప్పటికే శివాజీ గణేశన్ లెవెల్ దాటి



యమ్జీఆర్ స్థాయిలో నటించి పారేస్తున్నాడు రమణమూర్తి.

"అబ్బో... అయితే 'లాస్' బాగానే అయిందన్నమాట" చోద్యం చూస్తున్న వాళ్లలో ఆనందంతో నిండిన ఆశ్చర్యం.

"ఆ బ్రేస్‌లెట్ ఇరవైవేలు, ఛెయిన్ పదిహేను వేలు, ఉంగరాలు రెండూ ఇరవైవేలు, వెండి కంచం, గ్లాసూ పాతికవేలు, ఇంకా చిన్నాచితకా గిన్నెలూ, చీరలు... మొత్తంకలిపి నికరంగా లక్ష పైమాటే పోయుంటుంది" లెక్కకట్టేసాడు పక్కింటి స్టాటిస్టీషియన్ పాపారావు.

ఈ వార్త కాలనీ అంతా దావానలంలా వ్యాపించింది. చిలికి చిలికి గాలివానై అది రెండు మూడు లక్షలదాకా పోయింది. "ఆ ఇంకా చాలానే పోయుంటుంది... చెప్పుకోరూ..." అనేవాళ్లు కొంతమందైతే "ఆ... అంత పోయుండదూ... చావదూ... సానుభూతి కోసం గోరంతలు కొండంతలు చేస్తారు" అనే వాళ్లు మరికొందరు.

అక్కడి నుండి మొదలయ్యాయి రమణమూర్తికి సమస్యలు.

"మీరెక్కడికి వెళ్లారండీ ఇల్లు తాళం పెట్టి", "అరే ఎవర్నైనా ఇంట్లో పడుకోబెట్టి వెళ్లాల్సింది", "అయినా మీలాంటి తెలిసినవాళ్లు కూడా ఇలా లాక్డ్‌హౌస్ వదిలివెళ్తే ఎలాగండీ" అంటూ ప్రతి అడ్డమైన వాడూ నానా నిందలు, సలహాలూను.

"వెళ్లేముందు కనీసం మాకు ఒక్క మాటైనా చెప్పి ఉంటే మా అబ్బాయినన్నా పడుకోబెట్టేవాళ్లంగదా... మీకన్నీ గోప్యాలూ... అనుమానాలూనూ" పక్కింటి రాధమ్మ గారి విసుర్లు.



శ్రీ బి.ఎస్. రాములు షష్టిపూర్తి సందర్భంగా ఆర్టిస్ట్ చంద్ర వేసిన పెయింటింగ్‌ని శ్రీ రాములు దంపతులకు అందజేస్తున్న డా॥ సి. నారాయణరెడ్డి.

"ఉంగరాలు, గొలుసు, బ్రేస్‌లెట్ బీరువాలో దాచడమేమి ఖర్మండీ... ఆఫీస్‌కెలాగూ ఏనాడూ పెట్టుకొచ్చిన పాపానపోలేదు... అవున్నదెందుకూ? కనీసం అత్తగారింటికి వెళ్లేటప్పుడన్నా వేసికెళ్లొచ్చుగదా!" కొలీగ్ వెంకట్రావ్ నిందాపూర్వక సానుభూతి.

"ఇది గ్యారంటీగా తెలిసినవాళ్ల పనేనండీ... మీ రాకపోకలు, ప్రయాణాలు గమనించిన ఎవడో తెలిసినవాడే చేసుంటాడీపని" చుట్టూ ఉన్న వాళ్లని అనుమానంగా చూస్తూ విషయాన్ని నిర్ధారిస్తూ చెప్పాడు మిస్టర్ గిరీశం – ఆ ఏరియాలో ఎక్కడేం జరిగినా క్షణాల్లో వెళ్లి వాలిపోయి, వేలమైళ్ల దూరం వ్యాపింపజేయగల సమర్థుడు.

అసలు ఎవళ్లింట్లో దొంగలు పడ్డా ప్రతివాడూ ముందు అనేమాట "ఎవడో తెలిసినవాడే చేసుంటాడండీ" అని. తెలిసినవాడంటే దొంగతనం తెలిసినవాడా లేకపోతే 'ఇంటి సంగతి తెలిసినవాడా' అనేది ఎప్పటికీ డౌటే.

సురేష్ పరిస్థితిని గమనించాడు. ఇవి చిలవలు, పలవలుగా; అనుమానాలు పెనుభూతాలుగా మారి అనవసర గందరగోళం కాక ముందే పోలీసులకి ఫోన్‌చేసి పిలిపించాడు. యస్.ఐ. నరసింహం, కానిస్టేబుల్ కనకయ్య వస్తూనే నానా హడావిడీ చేశారు... "తప్పుకోండి... సైడ్ ప్లీజ్" అంటూ.

బీరువాని, తలుపులనీ దగ్గర్నుంచి, దూరంగా వెళ్లీ నానా రకాల పోజుల్లో పరిశీలించారు. ముందుగా యస్.ఐ. నరసింహం రమణమూర్తిని చడామడా తిట్టాడు.

"అసలు మీకు బుద్ధుందా...? మేమొచ్చేలోగా ఇవన్నీ ఎందుకు ముట్టుకున్నారు? వేలిముద్రలు పోవూ! అయినా, పెద్దకంపెనీలో ఉద్యోగి అయ్యుండి అత్తగారింటికి వెళ్తారా? అంటే... ఐ మీన్ ఇంటికి తాళంపెట్టి ఊరెళ్తారా?"

"వెళ్తారా?" కానిస్టేబుల్ కనకయ్య ముక్తాయింపు.

"అలా ఊరెళ్లే ముందు కనీసం మా పోలీసులకి చిన్న ఇన్ఫర్మేషన్ కూడా ఇవ్వరా మీరు?"

"ఇవ్వరా మీరూ...?" కనకయ్య.

"ఇస్తే ఆ పనేదో మీరే చేద్దామనా?" జనాల్లోంచి ఎవరో అని తప్పుకున్నారు.

"సైలెన్స్... ఎవరదీ... ఏమిటంటున్నారు? మాట్లాడద్దు" గర్జించాడు నరసింహం.

"ప్చ్... మన బ్యాడ్‌లక్కండీ" కానిస్టేబుల్ కనకయ్య జనాంతికంగా అన్నాడు.

"షటప్" హుంకరించాడు నరసింహం. చటుక్కున నాలిక్కరుచుకున్నాడు కనకయ్య.

ఇంకా ఏదో అనబోతున్న యస్.ఐ. నరసింహాన్ని ప్రక్కకి తీసికెళ్లాడు సురేష్... యఫ్ఐఆర్ కట్టడానికి ఒప్పించాడు.

బంగారం, వెండీ, డీవిడీ ప్లేయర్... మొత్తం మీద లక్ష రూపాయలపైనే పోయినట్లు ఎఫ్ఐఆర్ రాయించాడు రమణమూర్తి. ఓ 2,000 రూపాయల చమురు వదిలింది.

దొంగలు పడ్డారన్న ఏడుపు ఒకప్రక్క, పాతికవేలు నష్టపోతే లక్షపోయిందని ఎఫ్ఐఆర్ కట్టించిన తృప్తి మరోప్రక్క, చుట్టూ జనాల సానుభూతి ఇంకోప్రక్క... వీటన్నిటితో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు రమణమూర్తి.

ఆ రోజునుంచి రమణమూర్తికి అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి. "అసలేం జరిగిం

దండీ? మీరెక్కడున్నారు?" అన్న వాళ్లకి తను అత్తగారింట్లో ఉన్నప్పటినుంచి, ఇంట్లో దొంగలుపడ్డ వైనమంతా ఇరవై నిమిషాలసేపు చెప్పటం... వాళ్లు వేసే వెధవ ప్రశ్నలన్నిటికీ తను సమాధానం చెప్పటం; వచ్చిన ప్రతి అడ్డమైన వాడికీ కాఫీలు, టిఫిన్లు ఇవ్వవలసి రావడంతో భార్య లీలావతి విసుగు... డబ్బులు హారతి కర్పూరంలా కరిగిపోవడం... ఇలా మూర్తి జీవితం నరకప్రాయమైపోయింది. ఫోన్స్ చేసి పలకరించేవాళ్లు, మిస్డ్‌కాల్స్ ఇచ్చే 'ఆప్తబంధువులు,' 'ప్లీజ్‌కాల్' అని మెస్సేజ్‌లిచ్చే మిత్రరత్నాలు, 'ఒకసారి ఫోన్ చెయ్యరా' అని ఠక్కున పెట్టేసే ప్రాణమిత్రులు... వీళ్లందరి గోలతో ఫోన్ బిల్లు వేలల్లోకి మారింది.

ఆ భార్యాభర్తల మధ్య ప్రైవసీ కొరవడింది. వారం పదిరోజులకొకసారి కానిస్టేబుల్ కనకయ్య రావడం... "మీ కేసు సీరియస్‌గా పరిశీలిస్తున్నారండీ... మొన్న యస్పీగారొచ్చినప్పుడు ఇలాంటి లాక్డ్ హౌస్‌లని కొట్టే బ్యాచ్‌ని పట్టుకోవడానికి స్పెషల్‌టీమ్‌ని వేసారండీ" అంటూ ఏవేవో గాలికబుర్లు చెప్పి, వచ్చినప్పుడల్లా 2,3 వందలు గుంజెయ్యడం... ఇలా నెలకి వెయ్యికి పైగా వదులుతున్నాయి.

ఇలా ఆర్నెల్లు గడిచేసరికి చిక్కిశల్యమైపోయాడు రమణమూర్తి. కనకయ్య రౌడీ మామూళ్లు, 2,3 సార్లు యస్.ఐ. నరసింహానికి సమర్పించుకున్న మూడువేలు... ఇంట్లో సతీ లీలావతి సాధింపులు... వీటన్నిటితో విసిగిపోయి యస్.ఐ. నరసింహం దగ్గరికెళ్లి రెండు చేతులు ఎత్తి దండంపెట్టాడు.

"అయ్యా... నరసింహా... ప్రభో... నాకేసు ఇక విరమించుకుంటున్నాను. పోయిన సామాన్లతో పాటు ఇన్నాళ్లుగా మీకిచ్చినవీ పోయాయనుకుంటాను... ఇంక నన్నొదిలెయ్యండి బాబూ" బ్రతిమాలుకున్నాడు.

"ఇంపాజిబుల్... మీకేసు వదల్ను... మీ ఇంట్లోపడ్డ ఆ దొంగవెధవ... జైల్లోపడేడుస్తున్నాడు... వాణ్ణీ వదల్ను".

"ఆ... మా దొంగ దొరికాడా సార్?" ఆనందంతో దొంగని 'ఓన్' చేస్తూ అడిగాడు మూర్తి.

'ఆ... నిన్న దొరికాడు. మీ అత్తగారి ప్రక్కింట్లో పాలేరు వాడు. ఆ రాత్రి మీరక్కడున్నారని ఖాయంచేసుకుని, ఇంకో దొంగని తీసుకుని ఓ బైక్ దొంగతనం చేసి దానిమీదొచ్చి మీ ఇంట్లోపడ్డాడు... ఆ బైక్ దొరికి, తీగలాగితే డొంకంతా కదిలి... మీ దొంగ దొరికాడు".

"అంటే కరెక్ట్‌గా దొంగలుపడ్డ ఆర్నెల్లకి మనం..." అనబోతున్న కనకయ్యని "షటప్" అని గర్జించాడు నరసింహం.

రమణమూర్తిలో మొట్టమొదటిసారిగా ఆశ చిగురించింది. "సార్... ఆ దొంగని నేను చూడొచ్చా?"

"వైనాట్...? ఓ ఐదొందలు సబ్‌జైల్ సెంట్రీకిచ్చి; లోపలున్నాడు, వెళ్లిచూడండి... మాట్లాడండి" నవ్వుతూ అన్నాడు నరసింహం.

తనింట్లోపడ్డ దొంగతో మాట్లాడబోతున్నానన్న ఉత్సాహంతో ఐదొందలు వెంటనే ఇచ్చి, వాణ్ణి ఇంటర్వ్యూ చేశాడు రమణమూర్తి. ఆ రాత్రి వాళ్లింట్లో పడ్డవైనం కళ్లకు కట్టినట్టు కూల్‌గా, తాపీగా చెప్పాడు మంగడు. వాళ్లింట్లో ఆవకాయ అన్నం, నెయ్యి చాలా బాగున్నాయన్నాడు.

కడుపురగిలిపోయింది మూర్తికి. లేచి వాణ్ణి కొడదామంటే వాడు సెల్‌లో ఉన్నాడాయె. బలవంతాన కోపాన్ని అణచుకొని; బయటికొచ్చి

యస్సైకి థాంక్స్ చెప్పి, ఇంటికొచ్చి భార్యకి ఆనందంగా చెప్పాడా విషయం.

ఆర్నెల్ల తర్వాత ఆనందంగా నిద్రపోయాడా రాత్రి.

మర్నాడు పోలీస్‌స్టేషన్ నుంచి కబురొచ్చింది. భార్యాభర్తలిద్దరూ వెళ్లారు... దొరికిన వస్తువుల ఐడెంటిఫికేషన్ కోసం. లీలావతి చీరలు, రమణమూర్తి డ్రెస్‌లు ఉంగలుగా, పరమదరిద్రంగా ఉన్నాయి.

"ఆ... నావే... ఏమండీ నా చీరలండీ... అరె ఈ డ్రెస్‌లు కూడా మీవేనండీ" ఆనంద భాష్పాలు కారుస్తోంది లీలావతి.

"అయినా ఏం చేస్తాం...? వీటిని ఇంక వాడలేముగా..." అని యస్సైతో "వాటిని మీ స్టేషన్ ఊడ్చేవాళ్లకిచ్చెయ్యండి" అన్నాడు. లీలావతికి ఏడుపొచ్చింది.

అయినా భర్త ఆలోచనే కరెక్ట్. 'ఆ దొంగ వెధవల దగ్గర ఆర్నెల్ల నుంచీ పడున్న గుడ్డల్ని మనమెట్లా వాడతాం?' అని సర్దిచెప్పుకుంది.

"ఇదిగో మీ వెండి సామాను" కానిస్టేబుల్ కనకయ్య చూపించాడు. రమణమూర్తి, లీలావతిల ఆనందానికి హద్దుల్లేవు. 5 వెండిగిన్నెలు, గ్లాసు, కంచం... తమవే... యస్సైకి హృదయపూర్వకంగా థాంక్స్ చెప్పారిద్దరూ.

"రేపు సోమవారం కోర్టుకొచ్చి, వీటిని ఐడెంటిఫై చేసి, మావేనని చెప్పి తీసికెళ్లండి" అన్నాడు.

"అలాగేనండీ..." అంటూ వెళ్లబోతున్న వాళ్లతో, "మరి, పోయిన మీ బంగారం సంగతేమిటి? మర్చిపోయారా, లేక అసలు పోనే లేదా?" నర్మగర్భంగా చూసాడు.

పోయిన వస్తువులు చూసిన ఆనందంలో 'పోని వస్తువులు' గుర్తుకు రాలేదిద్దరికీ. గతుక్కుమని... "మరేనండీ మా బంగారం, డీవీడీ సంగతేమిటి?"

"ఆ దొంగనాయాలు అసలు మీ ఇంట్లో బంగారమే దొరకలేదన్నాడే..." వంకరగా చూస్తూ అన్నాడు నరసింహం.

"లేదండీ... అన్నీ దొంగమాటలూ వాడూనూ" ఇంకా ఏదో చెప్పబోతున్న మూర్తి మాటల్ని మధ్యలోనే కట్‌చేస్తూ "ఎవరు దొంగలో కోర్టే తేలుస్తుంది. కాకపోతే అన్నీ దొరకాలంటే కనీసం మరో ఆర్నెల్లు పడుతుందంతే"

ఇంకో ఆర్నెల్లు మళ్లీ టార్చర్ భరించాలంటే రమణమూర్తికి గుండాగినంత పనైంది.

"యస్సైగారూ...ఇవి చేతులుకావు కాళ్లు ... మా కేస్ ఇంతటితో క్లోజ్ చెయ్యండి బాబూ... మాకు బంగారమూ వద్దు... ఇంకేమీ వద్దు... దొరికిన సామాన్లిచ్చి పంపండి చాలు" అన్నాడు.

"అలా కుదర్దు... ఎఫ్ఐఆర్‌లో రాసిన సామానంతా రికవరీ చూపాల్సిందే" యస్సై హూంకారం.

"అయితే మరి మార్గమేమిటి?" మూర్తి ఆక్రోశం.

"రేపు కోర్టులో మీ వెండి సామానంతా మీకిచ్చేస్తాను" వెలిగిపోయాయి భార్యభర్తల మొహాలు.

"మీ బంగారం, డీవీడీ ప్లేయర్ కూడా ఇస్తాను... మీవేనని ఒప్పుకొని కేస్ క్లోజ్ చేయించుకుంటారా?"

"ఆ..." వెంటనే తలూపారిద్దరూ.

"అయితే రేపు కోర్టుకొచ్చేముందు స్టేషన్‌కి రండి. వస్తూ వస్తూ రెండు ఉంగరాలు, ఓ గొలుసూ, ఓ బ్రేస్‌లెట్... ఎవరివైనా తీసుకు రండి. వాటిని మాకిచ్చి, కోర్టులో చూపించి నప్పుడు ఇవి మావేనని చెప్పండి... ఓ సెకండ్ హాండ్ డీవీడీ కూడా తెచ్చుకోండి. డబ్బాలాంటి దైనా పర్లేదు... ఓకే" యస్సై సలహా కమ్ ఆర్డర్.


"ఓకే సార్..." దీనంగా అన్నారు.

ఈ సెటిల్మెంట్‌కిగాను స్టేషన్‌స్టాఫ్‌కి, కోర్ట స్టాఫ్‌కీ ఓ ఐదువేలు ఇస్తే రేపటితో మీకూ మా కూ ఋణం తీరిపోతుంది. కాదంటే... మీ బంగారం దొరికిందాకా ఈ నరసింహం నిద్ర పోడు "లాఠీని రెండు చేతులతో గట్టిగా పట్టు కుని భీషణ ప్రతిజ్ఞ చేయబోయాడు.

"అంతటి ఘోరమైన ప్రతిజ్ఞలొద్దు యస్సై గారూ" అంటూ నాలుగువేలకి బేరమాడి 'డీల్' సెటిల్ చేసుకుని; మర్నాడు నానా తంటాలూ పడి బంగారం షాపువాణ్ణి ఎరువడిగి తెచ్చి, కోర్టులో ప్రదర్శించి; ఎట్టకేలకు తమ వెండి సామాన్లు... కంచం, గ్లాసు, ఐదు గిన్నెలు... రికవరీగా తీసుకొని, దోషిలాగా బోనులో నిం చొని, వందచోట్ల సంతకాలు పెట్టి... బ్రతుకు జీవుడా" అంటూ బయటపడ్డాడు రమణమూర్తి.

తన ఇంట్లో "దొంగలు నిజంగానే పడ్డారు" అని ఇప్పటికి తెలుసుకున్నాడు.

భర్త చేతుల్లోంచి వెండిగ్లాసు, ఐదు గిన్నెలూ లాక్కున్న లీలావతి "పదండి... తిరపతెళ్లొ ద్దాం... మన సామాను మనకి దొరికితే వెండి గ్లాసు, గిన్నెలూ హుండీలో వేస్తానని మొక్కు కున్నాను... కంచం ఉంచుకోండి చాలు" అం టున్న భార్యని అయోమయంగా చూస్తూ "గోవిం దా గోవింద" అనుకున్నాడు రమణమూర్తి. ●



వేముల పెరుమాళ్లుగారి "మానవతా పరిమళాలు", వేముల ప్రభాకర్ గారి "బతుకుతొవ్వ" గ్రంథాల ఆవిష్కరణ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన దృశ్యం గ్రంధకర్త వేముల ప్రభాకర్‌తో ముఖ్య అతిధులు ఆచార్య రవ్వా శ్రీహరి, మాజీ మంత్రివర్యులు టి. జీవన్‌రెడ్డి